teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 192 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 8 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ' 5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## నీటిపై రాజకీయం వద్దు

సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటే తప్పేంటి?

ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు



04





# కుక్కలను చంపొద్దు

షెల్టర్లకు తరలించండి

వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

వీధి శునకాలకు సంబంధించిన విచారణలో సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సమస్య కుక్క కాటుకు మాత్రమే పరిమితం కాదని ధర్మాసనం పేర్కొంది. సైకిళ్ళు, మోటార్ సైకిళ్లపై ప్రజలను వెంబడించే కుక్కలు సమానంగా ప్రమాదకరమని, తీవ్రమైన రోడ్డు ప్రమాదాలకు దారితీయవచ్చని పేర్కొంది. వీధి కుక్కలను తొలగించడంపై అభ్యంతరంపై బెంచ్ స్పష్టత కోరింది.

2



## హైదరాబాద్‌లో సంక్రాంతి సంబరాలు

కైట్, డ్రోన్, హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్స్

జనవరి 13 నుంచి 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

19 దేశాల ప్రతినిధుల రాక

హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇందులో భాగంగానే ప్రతి యేటా కైట్ ఫెస్టివల్

మిగతా 2 లో

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా

కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమీక్ష




పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కీలక ఆదేశాలు

జనవరి 13న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా

హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ మున్సిపాలిటీలు కార్పొరేషన్ల రెండవ సాధారణ ఎన్నికలు సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా ఈసీ పలు ఆదేశాలు జారీ చేసింది. 13 జనవరి 2026న పోలింగ్ స్టేషన్‌ల ముసాయిదా జాబితా ప్రచురణ – టీ–పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, 16 జనవరి

మిగతా 2 లో




## దేశంలో పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

సరికొత్త చరిత్రకు మోడీ సర్కార్ శ్రీకారం

జనవరి 26న ప్రారంభం కానున్న ప్రయోగాత్మక పరుగు

న్యూ ఢిల్లీ, జనవరి 07 (తీన్మార్ న్యూస్): రైల్వే రంగంలో మరో కీలక ఘట్టానికి మోడీ ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఇండియాలో తొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనుంది. ఈ మేరకు హర్యానాలో ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేసింది కేంద్ర ప్రభుత్వం. ఉత్తర రైల్వే ఆధ్వర్యంలో రూపొందిన ఈ తొలి హైడ్రోజన్ రైలు, జింద్ – సోనీపత్ మధ్య పరుగులు

మిగతా 2 లో



02

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంచలనం

సీఎం సోదరుడు, మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు

స్టేట్‌మెంట్ రికార్డ్ చేసేందుకు రావాలని సిట్ ఆదేశం

## కాంగ్రెస్ పాలనలో "అన్నీ ఎగవేతలు, కూల్చివేతలే"

రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం

క్వార్టర్ ఫైనల్లో గెలిచాం.. ఫైనల్ మనదే



ఖమ్మం, జనవరి 07 (తీన్మార్ న్యూస్): ఎగవేతలు, కూల్చివేతలతో కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని అందుకే ఆ పార్టీని తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని

మిగతా 2 లో



## సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ ప్రయాణికులకు 'ధరల' షాక్

ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 రెట్లు అదనపు బాదుడు

జనవరి 9 నుండి 13 వరకు ప్రత్యేక సర్వీసులు

02

## ఐబొమ్మ రవికి షాక్

బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన నాంపల్లి కోర్టు



హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మది రవికి షాక్ తగిలింది. బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు

మిగతా 2 లో

## కవిత రాజీనామా ఆమోదంపై "గుత్తా సుఖేందర్ రెడ్డి క్లారిటీ"

కొంతకాలం వేచి చూసి ఆమోదించామని వెల్లడి

కొత్త పార్టీలపై కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎంపీ పదవికి రాజీనామా చేయడం, దాని ఆమోదం, కొత్తపార్టీ ప్రకటనపై తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన ఆయన ఎవరైనా భావోద్వేగంతో రాజీనామా చేసినపుడు కొంతకాలం వేచి

మిగతా 2 లో



## వరంగల్ మన రెండో రాజధాని

డ్రైనేజీ వ్యవస్థకు రూ. 4 వేల కోట్లు

పనులకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

మామునూరు ఎయిర్‌పోర్టుకు మార్గం సుగమం

భూసేకరణ ప్రక్రియ పూర్తి

రెవెన్యూ యంత్రాంగానికి మంత్రి అభినందనలు

04

## నిర్మలా సీతారామన్ వీడియోలు ఫేక్

ఇన్వెస్ట్‌మెంట్ ప్రకటనలపై పిబ్ ఫ్యాక్ట్ చెక్

సోషల్ మీడియాలో మంత్రి వీడియోలు డీప్‌ఫేక్ అని నిర్ధారణ




.. వివరాలు 2లో

# కుక్కలను చంపొద్దు



న్యూ ఢిల్లీ, జనవరి 07 (తీన్మార్ న్యూస్): వీధి శునకాలకు సంబంధించిన విచారణలో సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సమస్య కుక్క కాటుకు మాత్రమే పరిమితం కాదని ధర్మాసనం పేర్కొంది. సైకిళ్ళు, మోటార్ సైకిళ్లపై ప్రజలను వెంబడించే కుక్కలు సమానంగా ప్రమాదకరమని, తీవ్రమైన రోడ్డు ప్రమాదాలకు దారితీయవచ్చని పేర్కొంది. వీధి కుక్కలను తొలగించడంపై అభ్యంతరంపై బెంచ్ స్పష్టత కోరింది. ఈ అంశాన్ని మరింత నొక్కి చెబుతూ, సంస్థాగత ప్రాంతాల నుండి వీధి కుక్కలను తొలగించడంలో ఉన్న వ్యతిరేకతను వివరించాలని బెంచ్ న్యాయవాదిని కోరింది. కుక్క కరిచే మూడ్‌లో ఉన్నప్పుడు దాని మనసులో ఏముందో మనం చదవలేం కదా అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అందుకేనివారణే ఉత్తమమైన మార్గమని, అయితే కుక్కలను కాల్చి చంపాలని సూచించడం లేదని, వాటిని ఆశ్రయాలకు మార్చాలని బెంచ్ నొక్కి చెప్పింది. మున్సిపల్ సంస్థలు జంతు జనన నియంత్రణ నియమాలను కఠినంగా అమలు చేయడం వల్ల పర్యవేక్షణతో క్రమంగా సంఖ్యలు తగ్గుతాయని కూడా పేర్కొంది. లక్షలాది కుక్కలకు ఆహారం ఇవ్వడం యొక్క సాధ్యాసాధ్యాలను బెంచ్ ప్రశ్నించింది. అలాగే యానిమల్ బర్త్ కంట్రోల్ నియమాలు, చట్టాలను పాటించేలా చూడటం కోర్టు పాత్ర అనిజస్టిస్ విక్రమ్ నాథ్ స్పష్టం చేశారు. పాటించని రాష్ట్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనిపై తన వాదనను వినిపిస్తూ కుక్కలను తొలగించడం వల్ల పట్టణ సమస్యలు మరింత తీవ్రమవుతాయని, భారతదేశం వంటి దేశంలో చెత్త డంపింగ్, మురికివాడలు విస్తృతంగా ఉన్న చోట, వీధి కుక్కలను తొలగించడం వల్ల ఇప్పటికే ఉన్న సమస్యలు మరింత తీవ్రమవుతాయని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హెచ్చరించారు. పట్టణ పర్యావరణ వ్యవస్థలలో కుక్కలు పాత్ర పోషిస్తాయని మరియు ఆకస్మిక తొలగింపు ఊహించని పరిణామాలను సృష్టించవచ్చని ఆయన వాదించారు ఏబీసీ, సీఎస్వీఆర్ (వంధ్యీకరణ-టీకాలు వేయడం,విడిచిపెట్టడం) లాంటి చర్యల ద్వారా వీటి సంఖ్యన పరిమితం చేయవచ్చని కూడా సిబల్ ప్రతిపాదించారు. దీన్ని విజయవంతంగా పరీక్షంచారనీ, కుక్కల్ని నిర్మూలించడం కాకుండా, వాటి జనాభాను నియంత్రించాలన్నారు. అలాగే వీధి కుక్కలను షెల్టర్లలోకి మార్చడం శారీరకంగా అసాధ్యం, ఆర్థికంగా అసాధ్యమైనదని సిబల్ సుప్రీంకు తెలిపారు. ప్రత్యామ్నాయాలను అన్వేషించడానికి శాస్త్రవేత్తలు మరియు డొమైన్ నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని సిబల్ సుప్రీంకోర్టును కోరారు. వాదనలు ఇంకా కొనసాగుతున్నాయి. కాగా తమ వద్ద విచారణలో ఉన్న కేసుకు అనుబంధంగా కుప్పలుతెప్పలుగా అనుబంధ పిటిషన్లు, దరఖాస్తులు వచ్చిపడుతున్నాయని సుప్రీం వెల్లడించింది. సాధారణంగా చూస్తే మనుషులకు సంబంధించిన ఏ కేసులో కూడా ఇన్ని అప్లికేషన్లు రాలేదేమో. కుక్కల విషయంలో పిటిషన్లు పోటెత్తుతున్నాయి. ఇలాంటి అప్లికేషన్లు బుధవారం కూడా వస్తాయేమో. అన్నీ కలిపి బుధవారమే కేసును విచారిస్తాం అని సుప్రీంకోర్టు వెల్లడించింది. వీధి శునకాలకు సంబంధించిన కేసును జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల ధర్మాసనం విచారిస్తోంది.

## కవిత రాజీనామా ఆమోదంపై "గుత్తా సుఖేందర్ రెడ్డి క్లారిటీ"



మొదటి పేజీ తరువాయి

చూస్తామని, కవిత విషయంలో కూడా అదే జరిగిందని తెలిపారు. ఆమె విజ్ఞప్తి మేరకే రాజీనామాను ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఇక కవిత కొత్త పార్టీ ప్రకటన విషయానికొస్తే రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పుడు కొత్తగా పార్టీ వచ్చినా దాని మనుగడ కష్టమన్నారు. గతంలో కొత్తగా వచ్చిన కొన్ని రాజకీయ పార్టీలు అలాగే కనుమరుగయ్యాయని గుర్తు చేశారు. ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడుతారన్నదానిపై స్పష్టత లేదని గుత్తా సుఖేందర్ తెలిపారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షణాది రాష్ట్రాలకు నష్టమని పేర్కొన్నారు. హిల్ట్ విధానం ద్వారా రాష్ట్రంలో ఎలాంటి అవినీతి జరగదని గుత్తా స్పష్టం చేశారు. కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరును తొలగించడం సరికాదని గుత్తా సుఖేందర్ అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్‌లో సంక్రాంతి సంబరాలు

మొదటి పేజీ తరువాయి



నిర్వహిస్తున్నామని ఈసారి జనవరి 13-15వ తేదీ వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌడ్స్ లో కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించబోతున్నామని, జనవరి 13-14 తేదీల్లో గచ్చిబౌలిలో డ్రోన్ షో నిర్వహిచబోతున్నామని చెప్పారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి కైట్ ఫెస్టివల్‌లో 19 దేశాలకు చెందిన 40 మంది పాల్గొంటారని, డ్రోన్ షో లో భాగంగా అత్యాధునిక ఎల్‌ఈడీ డ్రోన్లతో గగనతల విన్యాసాలు ఉంటాయని, తెలంగాణ పర్యాటక ప్రాంతాల డిజిటల్ ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది కొత్తగా జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. ఈ ఈవెంట్స్ కు అందరూ రావాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పండగలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించామన్నారు.

### ప్రపంచ దేశాలను ఆకర్షించాలి:

పర్యాటక రంగంలో తెలంగాణ వెనుకబడి ఉందని రాష్ట్రంలో కనీస అవసరాలు లేని ప్రాంతాలు చాలా ఉన్నాయని మంత్రి చెప్పారు. టూరిజంలో ప్రపంచ దేశాలను ఆకర్షించాలన్నారు. పెట్టుబడులు ఆకర్షించి వివిధ ప్రాంతాలు అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పర్యాటక, మెడికల్, ఎకో, టెంపుల్, టూరిజంలో పెట్టుబడుల ఆకర్షిస్తామని చెప్పారు. పర్యాటక రంగాన్ని బలోపేతం చేస్తున్నామని ప్రకృతి సంపదను ప్రజలకు దగ్గర చేస్తున్నామన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు టూరిజంపై ఆధారపడ్డాయని తెలంగాణ మాత్రం అడుగున ఉన్నామన్నారు. రాష్ట్రంలో గొప్ప గొప్ప కట్టడాలను పర్యాటకులకు తెలియజేయాలని అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంచలనం



హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపులు తీసుకుంటోంది. ఈ కేసు దర్యాప్తులో సిట్ దూకుడు పెంచింది. తాజాగా ఇద్దరు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి సైతం నోటీసులు జారీ చేసింది. గురువారం తమ ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యలకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో మాజీ అధికారులను దఫదఫాలుగా ప్రశ్నించిన సిట్ రాజకీయ నేతలను సైతం సిట్ విచారించడం మొదలుపెట్టింది. మొన్నీమధ్యే ఎమ్మెల్సీ నవీన్ రావును సుదీర్ఘంగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో ఇద్దరు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను ప్రశ్నించబోతుండడం విశేషం. అయితే కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను అధికారులు గతంలోనే విచారించారు. ఈ కేసులో మరో నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ అదనపు ఎస్పీ మేకల తిరుపతన్న ఫోన్‌లో లింకు దొరికిన నేపథ్యంలో ఆ ఆధారాలను ముందుపెట్టి ఈ మాజీ ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. అయితే తాజాగా ఈ కేసులో సిట్‌ను తెలంగాణ ప్రభుత్వం మార్చింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో 9 మంది అధికారుల బృందానికి ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును అప్పగించింది. అప్పటి నుంచి పొలిటికల్ లీడర్లను ప్రశ్నించడం మొదలైంది. ఇక సీఎం రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డికి సైతం సిట్ నుంచి పిలుపు వచ్చింది. ప్రతిపక్ష నేతగా ఉన్న టైంలో రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు సిట్ గుర్తించింది. ఈ క్రమంలోనే ఆయనను సైతం తమ ఎదుట హాజరు అయ్యి తాము అడిగే ప్రశ్నకు సమాధానాలు ఇవ్వాలని సిట్ కోరినట్లు సమాచారం. మరోవైపు ఈ కేసులో మాజీ మంత్రి హరీష్‌రావును విచారించాలన్న సిట్ ప్రయత్నం ఫలించలేదు. ఆయనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేయగా, తాజాగా ఆ తీర్పును ఇటు సుప్రీం కోర్టు సమర్థించడంతో ఊరట లభించినట్లైంది. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును సిట్ రెండు దఫాలుగా కస్టోడియల్ ఎంక్వైరీ జరిపింది. ఆ విచారణకు సంబంధించిన నివేదికను ఈ నెలాఖరులోపే దర్యాప్తు బృందం కోర్టుకు సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు విచారణ రాజకీయ మలుపు తీసుకోవడం ఆసక్తిని రేత్తిస్తోంది.




## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు నగారా

మొదటి పేజీ తరువాయి

2026న ఫోటోలతో కూడిన తుది ఓటర్ల జాబితా పోలింగ్ స్టేషన్‌ల వారీగా ప్రచురించాలని ఆదేశించింది. బ్యాలెట్ బాక్సుల అంచనా వేసి, అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని ఆదేశించింది. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారుల నియామకం త్వరగా పూర్తి చేయాలని సూచించింది. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల నియామకం కూడా త్వరలో పూర్తి చేయాలని సూచించింది. పోలింగ్ సిబ్బంది నియామకం కోసం ఉద్యోగుల వివరాలు టీ-పోల్ లో తక్షణమే అప్‌డేట్ చేయాలని పేర్కొంది.

## దేశంలో పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

మొదటి పేజీ తరువాయి

తీయనుంది. ఈ రైలుకు ఇంధనం అందించడానికి జింద్ లో ప్రత్యేకంగా హైడ్రోజన్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేసింది రైల్వే శాఖ. ఇక గణతంత్ర దినోత్సవం అంటే జనవరి 26వ తేదీన ఈ హైడ్రోజన్ రైలు ట్రయల్ రన్ ప్రారంభం కానుంది. గంటకు 150 కిలోమీటర్ల గరిష్ట వేగంతో పట్టాలపై పరుగులు తీసే సామర్థ్యం ఉన్న ఈ హైడ్రోజన్ రైలు ట్రయల్ రన్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే ఛాన్స్ ఉంది.

## సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్ న్యూస్‌తో పాటు ఓ బ్యాడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో 6431 ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 9,10,12,13 తేదీల్లో స్పెషల్ బస్సులు నడపాలని సంస్థ నిర్ణయించింది. అదే విధంగా 18,19 తేదీల్లో ప్రయాణికుల తిరుగు ప్రయాణం సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్టు పేర్కొంది. హైదరాబాద్ లోని ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, మియాపూర్, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల నుండి స్పెషల్ బస్సులు నడవనున్నట్టు పేర్కొంది. మరోవైపు పండుగ సందర్భంగా టికెట్ ధరలు సైతం పెంచుతున్నట్టు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం టికెట్ ధరలు 1:5 వరకు సవరించినట్టు స్పష్టం చేసింది. అంతేకాకుండా మహాలక్ష పథకంలో భాగంగా మహిళలు పల్లెవెలుగు, సిటీ ఎక్స్ ప్రెస్, ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో ఉచితంగానే ప్రయాణించవచ్చని స్పష్టం చేసింది.

## కాంగ్రెస్ పాలనలో "అన్నీ ఎగవేతలు, కూల్చివేతలే"

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన నూతన సర్పంచ్‌ల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. క్వార్టర్ ఫైనల్‌లో(సర్పంచ్ ఎన్నికలను ఉద్దేశించి) మంచి ఫలితాలు వచ్చాయి. సెమీ ఫైనల్ లో మంచి ఫలితాలు వస్తాయి. చివరికి ఫైనల్ లో విజయం మనదే. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. యూరియా బస్తాలు దొరకడం లేదని రైతన్నలు చెబుతున్నారు. పాలిచ్చే గేదెను వదులుకొని తన్నే దున్నపోతు ను గెలిపించారని నేను వారితో చెప్పా. అయిపోయింది ఏదో అయిపోయింది వచ్చేది బీఆర్ఎస్ అని రైతులు నాతో చెప్పారు. రైతులు ఎంత క్లారిటీగా ఉన్నారో అర్థమైంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాల్లేవ్. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్‌లలో చెప్పులు కనిపిస్తున్నాయి. షాపుల్లో లేని యూరియా యాప్‌ల్లో ఎలా వస్తుంది? కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలు. లక్ష కోట్ల బడ్జెట్ అన్నారు ఏమైంది?. కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇచ్చారా?. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చారా?. రెండేళ్లలో ఏం అభివృద్ధి జరిగింది? కూల్చివేతలు, ఎగవేతలే కనిపిస్తున్నాయి. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ పని చేశారు. ఇప్పుడు ఇదే జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. కనీసం రైతులకు యూరియా ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నారు. కమీషన్ల కోసమే ఆ మగ్గురు పని చేసేది. 30 శాతం ట్యాక్స్ నడిపిస్తున్నారు వాళ్లు. ఆరు గ్యారెంటీలు భద్రంగా పెట్టుకొండనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆనాడు ఎన్నికల ప్రచారం లో చెప్పారు. ఇప్పుడు రెండేళ్లు అయిన గ్యారెంటీలు అమలు కాలేదు. దీనికి భట్టి ఏమి సమాధానం చెబుతారు?. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఓటమికి రంగం సిద్ధమైంది. సర్పంచ్ ఎన్నికల్లో 40 శాతం పదవులు గెలుచుకున్నాం. ఇక్కడే రెండేళ్లలోనే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత వచ్చిందో తెలుస్తోంది. త్వరలో జగరబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదు. ఖమ్మం నుంచి 7 నుంచి 8 స్థానాలు గెలుస్తాం అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## ఐబొమ్మ రవికి షాక్

మొదటి పేజీ తరువాయి



కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీస్తుళ్లారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని బెయిల్ ఇస్తే దేశం దాటి పోయే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం రవి దాఖలు చేసిన ఐదు బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. ఇదిలా ఉంటే ఐబొమ్మ రవి పైరసీ కేసులో ఇటీవల సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పైరసీ సినిమాల ద్వారా రవి రూ. 13.40 కోట్లు ఆర్జించినట్లు తెలిసింది. ట్యాక్స్ ఎగ్గొట్టేందుకు అందులో రూ.90 లక్షలు తన సోదరికి పంపినట్లు పోలీసులు గుర్తించారు.

# విద్యార్థులు పోరాట పటిమ, సామాజిక స్పృహ కలిగి ఉండాలి

**జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్**



హనుమకొండ, జనవరి 07 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. కాకతీయ యూనివర్సిటీ ఇన్చార్జ్ జట్టి రాజేందర్ అధ్యక్షతన బుధవారం రోజున బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అలుపెరగని పోరాటం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యా రంగం, విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్వీ పోరాడుతోందని తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు మహిళా భద్రత, సాంప్రదాయాలు అనే అంశంపై ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువులతో పాటు ఉద్యోగ సాధనపై సైతం దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు పోరాట పటిమ, సామాజిక స్పృహ కలిగి ఉండాలి సూచించారు. విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాగా పోటీల్లో గెలుపొందిన వందన, నవ్య, లావణ్య బృందాలకు నగదు బహుమతిని అందజేశారు. ఇటీవల ఎండీ సీటు సాధించిన ఆటో డ్రైవర్ మేకల రమేష్ కుమార్తె మేకల హర్షిణికి సైతం నగదు సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంగాల సూర్య కిరణ్ వర్మ, గంద్రకోట రాకేష్ యాదవ్, పస్తం అనిల్, కోరపెల్లి రాజేష్, ప్రశాంత్, బొల్లపెల్లి వీరస్వామి, స్నేహిత్, సందీప్ యాదవ్, పబ్బోజు శ్రీకాంత్ చారి, తక్కళ్లపల్లి వినీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# నివాళర్పించిన చల్లా ధర్మారెడ్డి



గీసుకొండ, జనవరి 07 (తీన్మార్ న్యూస్): పరకాల నియోజకవర్గం గీసుకొండ మండల కేంద్రానికి చెందిన చాడ ప్రభాకర్ రెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడం జరిగింది.విషయం తెలిసిన పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి ప్రభాకర్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. అదేవిధంగా ఊకల్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన పడిదెల మాధవ రావు కుటుంబాన్ని మాజీ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఏకాంబ సురేష్‌ను పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి..



గీసుకొండ, జనవరి 07 (తీన్మార్ న్యూస్): పరకాల నియోజకవర్గం గీసుకొండ మండలం ఆరేపల్లి గ్రామ బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఏకాంబ సురేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఆయన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం ఉ దయం పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షంచారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి ఆఫీసర్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీ




ములుగు జిల్లా, జనవరి 07 (తీన్మార్ న్యూస్): జాతీయ రోడ్డు భద్రత మహోత్సవం 2026లో భాగంగా జనవరి ఫస్ట్ నుండి 31 జనవరి వరకు జరిగే రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఐఏఎస్ ఆదేశాల అనుసారం 7 జనవరి 2026 నుండి 11.01.2026 వరకు రోడ్డు భవనంల శాఖ ములుగు జిల్లా ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అందులో భాగంగా బుధవారం రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీని డిస్ట్రిక్ట్ ఆర్ అండ్ బి ఆఫీసర్ బి శ్యాంసింగ్ ఆధ్వర్యంలో చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్_ జీవన్ కుమార్ మాట్లాడుతూ రోడ్ పైకి వచ్చిన ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి సీట్ బెల్ట్ పెట్టుకుని మాత్రమే వాహనాలు నడపాలని సమ్మక్క సారక్క మహా జాతర ఉన్నందున ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి నిర్దేశించిన వేగంలోనే వెళ్లాలని సూచించారు ఈ కార్యక్రమంలో రామ్మూర్తి డీఈఈ, మరియు సిహెచ్ సారయ్య సుధాకర్ హరీష్ వెంకటేష్ అవినాష్ కృష్ణ సాయి సరిత శివ రమేష్ సదానందం సమ్మయ్య మొగిలి మొదలగు ఆర్ అండ్ బి అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మేడారంలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**అభివృద్ధి పనుల పరిశీలన రాష్ట్ర మంత్రి సీతక్క**



ఎస్.ఎస్. తాడ్వాయి, జనవరి 07 (తీన్మార్ న్యూస్): జాతర సమీపిస్తుండటంతో మేడారంలో జరుగుతున్న అభివృద్ధి, సౌకర్యాల పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్_కాన్, ఐ టి డి ఏ పీవో చిత్ర మిశ్రాలతో కలిసి మేడారం మ్యూజియం, చిలకలగుట్ట, ఊరట్టం కాజ్ వే, జంపన్న వాగు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ శుక్రవారం లోపు ఆర్చ్ పిల్లర్లు, సంబంధిత నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి పర్యటన సందర్భంగా మేడారంలో సభ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించి ఏర్పాటు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు ముక్కులు చెల్లించుకోవడానికి వస్తున్న భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దర్శనాలు కల్పించాలని, ప్రతి పనిని గడువులోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. మేడారం జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి కావాలని, ప్రతి శాఖ బాధ్యతగా పనిచేయాలనిమంత్రి స్పష్టం చేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.





# అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

**గిరిజన సంక్షమ క్రీడా పోటీలు ప్రారంభించిన రాష్ట్ర మంత్రి సీతక్క**



ఏటూరు నాగారం, జనవరి 07 (తీన్మార్ న్యూస్): విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని,ఆదివాసీ గిరిజన విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యతను ప్రోత్సహించడం, ప్రతిభావంతులను గుర్తించడం, రాష్ట్ర స్థాయిలో అవకాశాలు కల్పించడమే 6వ రాష్ట్ర స్థాయి గిరిజన సంక్షమ క్రీడా పోటీలు నిర్వహించే ముఖ్య ఉద్దేశం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షమ శాఖ, గిరిజన కమిషన్ ఆధ్వర్యంలో ఐటిడిఏ ఏటూరునాగారం మండల కేంద్రంలోనీ జంబోరి మైదానంలో బుదవారం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొని క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు, గిరిజన క్రీడాకారుల సంక్షమం కోసం కట్టుబడి ఉందని వారి ఎదుగుదలకు, అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.

రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడా పోటీలు ములుగు జిల్లాలో నిర్వహించడం చాలా గర్వకారణం అని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆటపాటలతో పాటు చదువు లో కూడా ప్రతిభ కనబరచాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ విద్యాలయాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మంచి ఫలితాలతో ముందుకు సాగుతున్నారని అదేవిధంగా రాబోయే టెన్త్ ఇంటర్ వార్షిక పరీక్షలలో ప్రథమ స్థానంలో ఉండేలా చదవాలని సూచించారు. విద్యార్థి దశలోనే శరీర దృఢత్వం అలవర్చుకోవాలని ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు శ్రమదానం చేయడం, ఇతరులకు సహాయం చేయడం వంటి మంచి లక్షణాలు నేర్చుకోవాలని పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్, టెలివిజన్ కు ఆకర్షితులైన పిల్లలు మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వసతి గృహాలలో ఉండే పిల్లలు ప్రతిరోజు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ చదువుకోవాలని అన్నారు. క్రీడలలో గెలుపు ఓటమి సహజమని క్రీడలు స్నేహ పూర్వకంగా జరగాలని ఓడిపోయిన విద్యార్థులు తమలోపాలను తెలుసుకుంటూ రాబోయే క్రీడల్లో గెలుపు సాధించే విధంగా శ్రమించాలని, గెలుపొందిన విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యలను సాధించడానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, గురువులను గౌరవించడం, పెద్దలను సంస్కారంతో మర్యాదపూర్వకంగా నమస్కారం అంటూ సంబోధించాలని, మహోన్నత వ్యక్తుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలని, విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ చిత్రా మిశ్రా, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గిరిజన క్రీడా శాఖ అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బ్లాకింట్లు అందజేత

**కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు**

జనగాం జిల్లా, జనవరి 07 (తీన్మార్ న్యూస్): ఆంగ్ల నూతన సంవత్సరం సందర్బంగా శుభాకాంక్షలు తెలపడానికి తమ వద్దకు వచ్చే వారిని బొకే లకు బదులు పేద విద్యార్థులకు వినియోగం అయ్యే వస్తువులను తేవాలిసిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఇచ్చిన సూచన మేరకు అధికారులు, ఇతరులు తెచ్చిన బ్లాంట్ లను మంగళవారం స్టేషన్ ఘనపూర్ లోని ప్రభుత్వ బాలుర, బాలికల బీసీ హాస్టల్ విద్యార్థులకు అధికారులు అందించారు. చలి విపరీతంగా ఉన్న ఈ పరిస్థితిలో తమకు బ్లాంట్ లను పంపడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్య శాఖ, సంక్షమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్

## కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వో కార్యాలయాల్లో వినతి పత్రాలు



భూపాలపల్లి, జనవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, అలాగే రాష్ట్ర కమిటీ సూచనల ప్రకారం, బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో వివిధ మండలాల అధ్యక్షులతో కలిసి జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వో కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలవుతున్న విధంగానే, బీసీల కోసం కూడా చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ పక్షన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు, సామాజిక-ఆర్థికంగా ముందుకు రావాలంటే వారికి ప్రత్యేక బడ్జెట్, చట్టపరమైన రక్షణ అత్యవసరం అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న సబ్ ప్లాన్ తరహాలోనే బీసీలకు కూడా ప్రత్యేక సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని పార్టీ బలంగా విశ్వసిస్తోందని అన్నారు. బీసీల కోసం కేటాయిస్తున్న నిధుల విషయంలో ప్రభుత్వాలు పారదర్శకంగా ఖర్చు చేయడంలో విఫలమవుతున్నాయని ఆరోపించారు. దీనికి ఉదాహరణగా 2014ఉ15 ఆర్థిక సంవత్సరంలో 431 కోట్లు కేటాయించగా, ఖర్చు చేసింది కేవలం 109 కోట్లు మాత్రమే. 2016ఉ17లో 4000 కోట్లు కేటాయించగా, 2000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 2018ఉ19లో 5000 కోట్లు కేటాయించగా, 3000 కోట్లు మాత్రమే వినియోగించారు. ఈ విధంగా 2014 నుంచి 2021 వరకు బీసీలకు కేటాయించిన బడ్జెట్‌లో కనీసం 26 శాతం కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. అలాగే, కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం, బీసీలకు ప్రతి బడ్జెట్‌లో 20,000 కోట్లు కేటాయిస్తామని చెప్పిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున డిమాండ్ చేశారు.

### ప్రధాన డిమాండ్లు:

- రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా కనీసం 50%కు పైగా నిధులు కేటాయించాలి
- బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి, నిధులు పక్కదారి పట్టకుండా ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత కూడా బీసీల కోసమే వినియోగించాలి
- ప్రతి మండలంలో బహుజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలి
- బీసీ విద్యార్థుల కోసం విదేశీ విద్య నిధి పథకాన్ని మరింత సరళతరం చేయాలి
- నిరుద్యోగ బీసీ యువతకు, కులవృత్తుల వారికి ఎటువంటి షరతులు లేకుండా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలి
- రాష్ట్రంలో బీసీల సామాజిక-ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం చేసిన సమగ్ర కుల గణన నివేదికను వెంటనే బహిర్గతం చేయాలి
- చివరిగా రవి పటేల్ మాట్లాడుతూ కేవలం నినాదాలతో కాకుండా, నిధులతో కూడిన చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ ద్వారానే బీసీలకు నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 07 (తీన్మార్ న్యూస్): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడిఓసి లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు లఘు చిత్రాలను రూపొందించి సినిమా థియేటర్లలో ప్రదర్శించాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలు, శిక్షణా కార్యక్రమాలు, వాహనదారులకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా రహదారులపై ఉన్న గుంతలను వెంటనే గుర్తించి పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు.రహదారులపై గుంతలను పూడ్చే బాధ్యత సంబంధిత ప్రతి శాఖకూ ఉందని అన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటి నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ఇందుకు అనుగుణంగా బ్లాక్ స్పాట్ల మ్యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

కొత్తగూడెం పట్టణంలో రైల్వే స్టేషన్ పరిసరాలు లక్ష్మీదేవిపల్లి మోర్ సూపర్ మార్కెట్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే కొత్తగూడెం పట్టణంలోని ఫుట్‌పాత్‌ల వెంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న చిరు వ్యాపారులను అనువైన ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తగిన స్థలాన్ని గుర్తించాలని అన్నారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను మరమ్మత్తులు చేసి సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీస్, ఆర్ అండ్ బీ, వైద్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్ట ప్రకారం జైలు శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

# వర్సిటీ భూములపై సర్కార్ కన్ను

## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్



హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): రెండేళ్లలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విశ్వవిద్యాలయాల భూమును పదే పదే టార్గెట్ చేస్తోందని మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఈ చర్యల వల్ల విద్య, పరిశోధనల పట్ల ప్రభుత్వ ఆలోచనపై సందేహాలు వ్యక్తం అవుతున్నయన్నారు. బుధవారం ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేసిన హరీశ్ రావు తొలుత ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయాల నుంచి 100 ఎకరాలకు పైగా భూమిని బలవంతంగా ఈ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ఈ ప్రక్రియలో 60 ఏళ్లుగా విలువైన జన్యువనరులు, పరిశోధనలతో ఉన్న ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రానికి చెందిన 60 ఎకరాలు పూర్తిగా నాశనం అయ్యాయని ఆరోపిచారు. ఆ తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలపై ప్రభుత్వం కన్నేసిందని ఈ క్రమంలో అటవీ భూమి దెబ్బతినడంతో పాటు జీవవైవిధ్యానికి అంతరించిపోతున్న వన్యప్రాణులకు ముప్పు ఏర్పడిందన్నారు. తాజాగా ఇప్పుడు ప్రభుత్వం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కన్నేసిందని ఇవన్నీ వేర్వేరు ఘటనలు కావని విద్యాసంస్థలపై జరుగుతున్న వ్యవస్థ బద్ధమైన దాడికి ఇవి నిదర్శనాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విశ్వవిద్యాలయాలు, పరిశోధనలు, విద్యార్థుల పట్ల వ్యతిరేకంగా ఉందా? విద్య, ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ కోసం కేటాయించిన భూమిని ఎందుకు వ్యర్థమని భావిస్తున్నారని నిలదీశారు. యూనివర్సిటీ భూముల విషయంలో ప్రభుత్వ చర్యలు సిగ్గుచేటని తెలంగాణ భవిష్యత్తును నిర్మించాల్సిన ప్రభుత్వం జ్ఞానాన్ని నిర్మించకుండా, దాన్ని బుల్డోజర్లతో కూల్చడంలోనే ఆసక్తి చూపుతోందని దుయ్యబట్టారు.

# వరంగల్ మన రెండో రాజధాని



వరంగల్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): వరంగల్‌ను తమ ప్రభుత్వం రాష్ట్రానికి రెండో రాజధానిగా చూస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆయన మంత్రి సీతక్కతో కలిసి హనుమకొండలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నామని పేర్కొన్నారు. భద్రకాళి ఆలయ పునరుద్ధరణ, మాడవీధుల పనులు త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. ఇక కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. వరంగల్‌లో నాలుగు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.4 వేల కోట్ల నిధుల విడుదలకు అనుమతినిచ్చిందని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు సంబంధించి భూసేకరణ కార్యక్రమం రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ చేసిన వర్కవుట్ పూర్తి అయిందని, అందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. వరంగల్ పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కార్పొరేట్‌కు ధీటుగా ఆసుపత్రి నిర్మాణాన్ని ఎలా పూర్తి చేయాలనే అంశంపై ఇవాళ సమావేశంలో చర్చించామని అన్నారు. నాటి ప్రభుత్వం అప్పగించిన మొండి గోడలతో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు అందజేస్తామని తెలిపారు. వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ నిలిచిపోయిందని, త్వరలోనే ఆ విషయంపై కూడా చర్చిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# నిర్మలా సీతారామన్ వీడియోలు ఫేక్




న్యూ ఢిల్లీ, జనవరి 07 (తీన్మార్ న్యూస్): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొన్ని పెట్టుబడి పథకాలకు ప్రచారం చేస్తున్నట్లు వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోలపై పిబ్ (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) ఫ్యాక్ట్ చెక్ టీమ్ స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సీతారామన్ వీడియోలు ఏఐ జనరేటెడ్ వీడియోలని స్పష్టం చేసింది. కేంద్రం, ఆర్థికశాఖ మంత్రి ఎలాంటి పెట్టుబడి పథకాలను ప్రోత్సహించడం లేదని తెలిపింది. ఇలాంటి వీడియోలకు స్పందించిందే ముందు ప్రభుత్వ అధికార పోర్టల్స్, ఆర్బీఐ, సెబీ వంటి సంస్థల ద్వారా నిజానిజాలను ధృవీకరించుకోవాలని సూచించింది. ఇలాంటి ప్రకటనల్లో ఇచ్చే లింక్స్ ను ఓపెన్ చేసేముందు ఒకటికి నాలుగుసార్లు క్రాస్ చెక్ చేసుకోవాలని పేర్కొంది. ఓటీపీ, బ్యాంకింగ్ కు సంబంధించిన పర్సనల్ డీటెయిల్స్ ను గుడ్డిగా ఎవరికీ షేర్ చేయవద్దని, ఇలాంటి ప్రకటనల వల్ల మోసపోయే ప్రమాదం ఉందని ప్రజలను హెచ్చరించింది.

# మేడారం జాతరకు విద్యుత్ వెలుగులు

## జనవరి 10లోగా పనులు పూర్తికి సీఎండీ ఆదేశం



హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): ఎన్పీడీసీఎల్ సీఎండీ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆసియాలోనే అతి పెద్దదైన మేడారం జాతరకు విద్యుత్ సరఫరా పనులను జనవరి 10 వరకు పూర్తి చేయాలని విద్యుత్ భవన్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ అధికారులను ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. సీఎండీ మాట్లాడుతూ జాతర కొరకు కొత్తగా నిర్మిస్తున్న 33/11 వి నార్లాపూర్ సబ్ స్టేషన్‌ను జనవరి 16 వరకు ఛార్జ్ చేయాలని, గట్టమ్మ ఆలయం వద్ద కొత్తగా నిర్మిస్తున్న 33/ 11 వి సబ్ స్టేషన్ 20 వరకు పూర్తి చేయాలని ఇప్పటివరకు వివిధ సామర్థ్యం గల ట్రాన్స్ఫార్మర్లు 170 వరకు పెట్టడం జరిగిందని, అవసరం మేరకు పెట్టాల్సిన ట్రాన్స్ఫార్మర్ల పనులు పూర్తి చేయాలన్నారు. ఎక్కడ అంతరాయం లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని మేడారం పార్కింగ్ స్థలాలలో పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. దాదాపు 500 మంది స్టాఫ్ జాతరలో విధులు నిర్వర్తిస్తున్నారని, ఏజెన్సీలు కూడా ఇందులో ఉంటారని తెలిపారు. అందరికి డ్యూటీ చార్ట్ వేయాలని అన్నారు. మేడారం వనదేవతల దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ముందుగానే అన్ని పనులు పూర్తి చేయాలని, జాతరను విజయవంతం చేయాలని కోరారు.

# నీటిపై రాజకీయం వద్దు



తెలంగాణ బ్యూరో, జనవరి 07 (తీన్మార్ న్యూస్): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య తాజాగా మరోసారి నీటి వివాదం తెరమీదకు వచ్చింది. దీంతో ఇరు రాష్ట్రాలకు చెందిన అధికార ప్రతిపక్షల నేతలు ఒకరిపై మరొకరు విమర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నీటి పంపకాల విషయంలో జరుగుతున్న రాద్దాంతంపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు సీరియస్‌గా స్పందించారు. నదుల నుంచి వృథగా సముద్రంలో కలుస్తున్న నీటిని ప్రజల అవసరాలకు వాడుకుంటే తప్పేంటని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజావసరాల కోసం చేపట్టే ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలు చేయడం, అనవసర వివాదాలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. నీరు అనేది రైతుల జీవితాలకు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశమని, దీనిని రాజకీయ కోణంలో చూడకూడదని ఆయన స్పష్టం చేశారు. గతంలో గోదావరి జలాలను మంజీరాకు తరలిస్తున్నప్పుడు తాము ఏనాడూ అడ్డుకోలేదని, పొరుగు రాష్ట్ర అవసరాలను తాము గౌరవించామని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం గోదావరిలో నీటి లభ్యత పుష్కలంగా ఉందని, ఉన్న నీటిని సమర్థవంతంగా వాడుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. నీటి విషయంలో నేతలు పోటీపడి ఆవేశపూరిత వ్యాఖ్యలు చేయడం, సవాళ్లు విసురుకోవడం ఇరు రాష్ట్రాల ఆరోగ్యకరమైన సంబంధాలకు మంచిది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.


### ప్రజల మధ్య చిచ్చు పెట్టొద్దు

ఈ అంశంపై ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, ఆ విద్వేషాలను చూసి ఆనందపడటం నాయకత్వ లక్షణం కాదని ఆయన చురకలు అంటించారు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే ధోరణిని విడనాడి, వాస్తవ పరిస్థితులను గమనించాలని కోరారు. జల వనరుల వినియోగంపై అనవసర గొడవలు పక్కనపెట్టి, సామరస్యపూర్వక వాతావరణంలో సమస్యలను పరిష్కరించుకోవాలనేది తమ అభిమతమని సీఎం చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా తేల్చిచెప్పారు.

# పదో తరగతి విద్యార్థులకు గుడ్ న్యూస్

### ప్రభుత్వ పాఠశాలల్లో సాయంత్రం అల్పాహారం

### స్నాక్స్ కోసం రూ. 4.23 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు




హైదరాబాద్, జనవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. త్వరలో జరగనున్న వార్షిక పరీక్షల నేపథ్యంలో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం వేళ అల్పాహారం అందించేందుకు నిధులను మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ కింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల కోసం మొత్తం రూ. 4,23,11,385 నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులను రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు విడుదల చేయాలని స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో నిర్వహించే ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు ఈ ఈవెనింగ్ స్నాక్స్ పంపిణీ చేయనున్నారు. మొత్తం 19 రోజుల పాటు అంటే ఫిబ్రవరి 16 నుంచి మార్చి 10 వరకు స్నాక్స్ అందించనున్నారు.

పరీక్షల సమయంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడంతో పాటు, సాయంత్రం వేళ అదనపు గంటలు చదువుకునే వారికి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. లెర్నింగ్ ఎన్‌హాన్స్‌మెంట్ ప్రోగ్రామ్ కింద ఈ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ నిధులను పంపిణీ చేయనున్నారు. ఈ నిర్ణయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సాయంత్రం పూట స్నాక్స్ అందించడం వల్ల విద్యార్థులు ఉత్సాహంగా చదువుపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

## ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పరిశీలకులు

### పుదుచ్చేరి, తమిళనాడుకు ఉత్తమ్ నియామకం

**న్యూఢిల్లీ, జనవరి 7:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు సీనియర్ పరిశీలకులను ఏఐసీసీ బుధవారం నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు–పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌కు ఈ పరిశీలకులను నియమించింది. ఈ నియమకాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శ కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. అస్సాం రాష్ట్రానికి మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బంధు తిర్కీ ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా నియమితులయ్యారు.

# కేంద్ర బడ్జెట్‌పై సందిగ్ధం

- ఫిబ్రవరి 1న ఆదివారం కావడంతో కొంత చర్చ
- త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం




**న్యూఢిల్లీ, జనవరి 7:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే బడ్జెట్ ప్రతిపాదనలను ఫిబ్రవరి1న ప్రవేశపెడతారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రావడంతో అదే రోజు ప్రవేశపెడతారా? అనే చర్చ జరుగుతోంది. అలా కానట్లయితే 2న ప్రవేశ పెట్టే అవకాశం కూడా ఉంటుంది. అయితే దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. తొలిసారిగా 2016లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2025లోనూబడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టారు. 2020లో కరోనా సమయంలోనూ, అంతకు ముందు 2012 మే 13న ఆదివారం పార్లమెంట్ సమావేశం జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు. గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరిరోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించు కునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదించాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలించిన తరువాత, మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమెదించే వారు. ఇది తీవ్ర జాప్యాలకు దారితీస్తుండటంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది. ఈక ÷–రమంలో ఈ యేడాది కూడా ఫిబ్రవరి 1ననే బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అభ్యంతరం ఉండకపోవచ్చు. ఇకపోతే ఇప్పటికే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడస్జెట్ కసరత్తు మొదలు పెట్టారు. వివిధ శాఖలనుంచి నివేదికలు తెప్పించుకున్నారు.



## ఢిల్లీలో కాలుష్యానికి తోడు చలి తీవ్రత

**న్యూఢిల్లీ, జనవరి 7:** ఢిల్లీలో గాలి నాణ్యతలు పడిపోయాయి. చలి తీవ్రత కూడా పెరిగింది. బుధవారం ఉదయం, మధ్యాహ్నం దట్టమైన పొగమంచు కురవడంతో భారత వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్‌ని జారీ చేసింది. బుధవారం ఉదయం ఢిల్లీలో ఎక్యూఐ 336 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) వెరీ పూర్ కేటగిరీలో వర్గీకరించింది. నెహ్రూనగర్‌లో ఎక్యూఐ 360 స్థాయిలు నమోదయ్యాయి. 21 పర్యవేక్షణా కేంద్రాల్లో ఎక్యూఐ స్థాయిలు వెరీ పూర్, 14 కేంద్రాల్లో పూర్ కేటగిరీలో ఎక్యూఐ స్థాయిలు నమోదయ్యాయని సిపిసిబి పేర్కొంది.

## ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

### అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి ● విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ, జనవరి 7:** పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

# గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి ఎత్తుగడలు

### పావులు కదుపుతున్న ట్రంప్




**వాషింగ్టన్, జనవరి 7:** వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన ఎంపికలపై అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం చర్చిస్తోందని వైట్‌హౌస్ మంగళవారం ప్రకటించింది. లక్ష్యాన్ని సాధించేందుకు 'మిలటరీ'ని ప్రయోగించడాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను అడ్డుకునేందుకు గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అమెరికా జాతీయ భద్రతా ప్రాధాన్యతగా ట్రంప్ భావిస్తున్నారని జాతీయ మీడియా ప్రశ్నలకు ప్రతిస్పందనగా వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునే మార్గాల గురించి ఓవల్ కార్యాలయంలో చర్చలు కొనసాగుతున్నాయని మరియు సలహాదారులు వివిధ మార్గాలపై చర్చిస్తున్నారని అమెరికా సీనియర్ అధికారి తెలిపారు. గ్రీన్‌ల్యాండ్‌కు మద్దతుగా నాటో నేతలు చేసిన ప్రకటనలపై ట్రంప్ భయపడటం లేదని అన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా కొనుగోలు చేయడం లేదా ఆ భూభాగంతో స్వేచ్ఛా అనుబంధ ఒప్పందం (సిఒఎఫ్ఎ) ఏర్పరుచుకోవడం కూడా ఉందని పేరు వెల్లడించేందుకు నిరాకరించిన ఒక అధికారి తెలిపారు. సిఒఎఫ్ఐ ఒప్పందం గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో భాగం చేయాలనే ట్రంప్ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని అన్నారు. వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అనంతరం గ్రీన్‌ల్యాండ్‌పై సుమారు రెండు నెలల్లో నిర్ణయం ప్రకటిస్తానని ట్రంప్ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఉగ్రవాదులకు అడ్డాగా పాక్

### పాకిస్థాన్‌లో లష్కరే, హమాస్ నాయకుల సమావేశం

### సంచలన వీడియో వైరల్



**ఇస్లామాబాద్:** ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన పాకిస్థాన్ నైజం మరోసారి బయటపడింది. ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబా, హమాస్ నేతలు ఇటీవల పాకిస్థాన్‌లోని గుజ్రాన్‌వాలాలో సమావేశమయ్యారు. పాకిస్థాన్ మర్కజే ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) నిర్వహించిన ఈ సమావేశంలో హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్ హాజరయ్యాడు. లష్కరే కమాండర్ రషీద్‌అలీ సంధుతో భేటీ అయ్యాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అమెరికా నిషేధించిన రెండు ఉగ్రవాద సంస్థలు ఒకేచోట సమావేశం కావడం సంచలనవుతుండగా, రెండు ఉగ్రవాద గ్రూపుల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ముఖ్య ఉద్దేశంగా ఈ సమావేశం జరిగినట్టు తెలుస్తోంది. అమెరికా నిషేధించిన రెండు ఉగ్రవాద సంస్థలు ఒకేచోట సమావేశం కావడం సంచలనవుతుండగా, రెండు ఉగ్రవాద గ్రూపుల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ముఖ్య ఉద్దేశంగా ఈ సమావేశం జరిగినట్టు తెలుస్తోంది.

### పాకిస్థాన్‌తో జహీర్ సంబంధాలు

పాకిస్థాన్‌తో నాజీ జహీర్‌కు ఉన్న సంబంధాలు కొత్తవి కావు. 2025లో ఆయన పలువురు హమాస్ నేతలతో కలిసి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) వెళ్లాడు. ఇది పహల్గాం ఉగ్రదాడికి ముందు జరిగింది. పీఓకే పర్యటన సందర్భంగా భారత వ్యతిరేక ర్యాలీలో లష్కరే తొయిబా, జైషే మొహమ్మద్ కమాండర్లతో కలిసి జహీర్ పాల్గొన్నాడు. 2024 జనవరిలో కరాచీని జహీర్ సందర్శించాడు. 2024 ఏప్రిల్‌లో ఇస్లామాబాద్ పర్యటించాడు. ఇస్లామాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సన్మానం అందుకున్నాడు. ఇవేకాకుండా, 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రదాడి జరిపిన తర్వాత వారం రోజులకు నాజీ జహీర్ పాకిస్థాన్‌కు వెళ్లాడు. జమియత్ ఉలేమా–ఇ–ఇస్లాం అధిపతి మౌలానా ఫజల్ ఉర్ రెహ్మాన్‌ను కలిశాడు.

# చిరుధాన్యాలతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు..



ప్రస్తుతం మారుతున్న జీవనశైలిలో అనారోగ్యకర ఆహారపు అలవాట్లకు అలవాటుపడ్డారు జనాలు. దీంతో కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. డయాబెటీస్, ఉబకాయం,అధిక రక్తపోటు, కిడ్నీ సంబంధిత వ్యాధులు ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏదో ఒక కారణంతో ఆస్పత్రుల్లో తిరగాల్సి వస్తుంది. మనం తినే ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే థైరాయిడ్, మూత్రపిండాలు, యూరిక్ యాసిడ్, కాలేయ వ్యాధులు, ప్యాంక్రియాటిక్ వంటి వ్యాధులకు చెక్ పెట్టొచ్చని అంటున్నారు నిపుణులు.

## చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలు:

డయాబెటీస్ కంట్రోల్: చిరుధాన్యాలలో 'గ్లైసెమిక్ ఇండెక్స్' తక్కువగా ఉండటం వల్ల ఇవి రక్తంలోని చెక్కర స్థాయిలను పెరగనీయకుండా చూస్తాయి.

అధికబరువు తగ్గడం: వీటిలో పీచు పదార్థం (ఖీఅఎవతీ) ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా ఆకలి వేయడం, బరువు తగ్గడం సులభమవుతుంది.

గుండె ఆరోగ్యం: చిరుధాన్యాలలో పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉండటం వల్ల అధిక రక్తపోటు(ధీూ) నియంత్రణలో ఉంటుంది, చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

జీర్ణక్రియ: పీచు పదార్థం వల్ల మలబద్ధకం సమస్యలు దూరమవుతాయి, జీర్ణ వ్యవస్థ శుభ్రపడుతుంది.

గ్లూటెన్ ఫ్రీ: గోధుమలు(+శ్రీబ్వఅ ఖశ్రీ-శ్రీవతీస్త్రఎ) పడని వారు చిరుదాన్యాలు తీసుకొని ఆరోగ్యాన్ని చక్కగా కాపాడుకోవచ్చు.

ఎలా తీసుకోవాలి:

చిరుధాన్యాలను వండుకునే ముందు కనీసం 6 నుంచి 8 గంటలు నానబెట్టాలి. దీనివల్ల వాటిలో ఉన్న పోషకాలు శరీరానికి బాగా అందుతాయి. చిరుధాన్యాలను అన్నం,రొట్టెలు,ఇడ్లీ,దోశ లేదా గంజిగా కూడా తీసుకోవచ్చు.

## చిరుధాన్యాల రకాలు:

కొర్రలు: డయాబెటీస్ ఉన్నవారికి కొర్రలు మంచి ఆహారం. శరీరంలోని కొలెస్ట్రాల్ లేకుండా చూస్తుంది. నరాలకు శక్తినిస్తుంది, మానసికంగా ధృఢంగా ఉండేలా చేస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లను పుష్కలంగా ఇస్తాయి.

అరికెలు: రక్తహీనత, బలహీనతగా ఉన్నవాళ్లకు అరికెలు ఒక గొప్ప వరం అనే చెప్పాలి. మలబద్ధకం, షుగర్ వంటి సమస్యలతో బాధపడేవారికి అరికెలు రోజూ తింటే ఎంతో ఆరోగ్యం. మంచి నిద్ర పడుతుంది, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

ఊదలు: ఇవి జీర్ణాశయానికి ఎంతో మేలు చేస్తాయి. చిన్న పెగు, పెద్ద పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. క్యాన్సర్ వంటి మహమ్మారి దగ్గరకు రాకుండా చూస్తుంది. రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. డయాబెటీస్ ఉన్నవారు ఊదలను తమ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు.

సామలు: అజీర్తి ఉన్నవారికి సామలు ఒక వరం అనే చెప్పొచ్చు. అతిసారం, అజీర్ణం, సుఖవ్యాధులు, అడవారి రుతు సమస్యలకు సామలు మంచి పరిష్కారాన్ని చూపిస్తాయి. మైగ్రెన్ నుంచి త్వరగా ఉపశమనం ఇస్తాయి. గుండె సంబంధిత సమయస్యలను పరిష్కరిస్తుంది. ఉబకాయం,కీళ్ల నొప్పులతో బాధపడేవారు సామలు తింటే చక్కటి ఆరోగ్యాన్ని పొందుతారు.



### చలికాలంలో మోకాళ్ల నొప్పులు ఎందుకు వస్తాయి?

# కారణాలు తెలుసుకోండి

శీతాకాలంలో మోకాలి నొప్పి పెరుగుతుంది. ఒకప్పుడు ఇది వృద్ధులకు మాత్రమే ఉండేది, కానీ ఇప్పుడు యువతలో కూడా కనిపిస్తుంది. మోకాళ్లలో గట్టిదనం, లేచినప్పుడు లేదా కూర్చున్నప్పుడు నొప్పి, లేదా నడుస్తున్నప్పుడు ఇబ్బందిగా ఉండటం శీతాకాలంలో సర్వసాధారణంగా మారాయి. అయితే, ఈ సీజన్‌లో మోకాళ్ల నొప్పులు ఎందుకు వస్తాయి? దీని వెనుక కారణాలు ఏంటి? దానిని ఎలా తగ్గించుకోవాలి? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..

ఆరోగ్య నిపుణుల ప్రకారం, చల్లని వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గడం వల్ల రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. చలి కారణంగా మన రక్త నాళాలు కుంచించుకుపోతాయి. దీని కారణంగా తగినంత రక్తం, ఆక్సిజన్.. మోకాలు, కీళ్ళను చేరుకోలేవు. ఇది కీళ్ల వశ్యతను ప్రభావితం చేస్తుంది. నొప్పితో పాటు దృఢత్వం పెరుగుతుంది. ఆస్టియో ఆర్థరైటిస్ కూడా మోకాలి నొప్పికి ఒక ప్రధాన కారణం. ఇది వయస్సు పెరుగుతున్న కొద్దీ ఎక్కువగా కనిపిస్తుంది. మోకాళ్ల మధ్య ఉన్న మృదులాస్థి క్రమంగా అరిగిపోవడం ప్రారంభమవుతుంది. చల్లని వాతావరణంలో మృదులాస్థి, చుట్టుపక్కల కండరాలు గట్టిగా మారుతాయి. దీని కారణంగా నొప్పి ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే మోకాలి సమస్యలు ఉన్నవారు శీతాకాలంలో ఎక్కువ నొప్పిని అనుభవిస్తారు.

శీతాకాలంలో శారీరక శ్రమ తగ్గడం వల్ల మోకాళ్ల నొప్పులు పెరుగుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. చలి కారణంగా ప్రజలు వ్యాయామం, నడక లేదా యోగా చేయడం తగ్గిస్తారు. ఇది కండరాలను బలహీనపరుస్తుంది. మోకాళ్లకు మద్దతు ఇచ్చే కండరాలు బలహీనపడినప్పుడు, కీళ్లపై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. నొప్పి పెరుగుతుంది. ఇంకా, చల్లని వాతావరణం శరీరంలో విటమిన్ డి లోపానికి కారణమవుతుంది. ఎముకలు, కీళ్ల బలానికి విటమిన్ డి చాలా అవసరం. విటమిన్ డి లోపం మోకాలి నొప్పికి కారణమవుతుంది.

శీతాకాలంలో మోకాళ్ల నొప్పులను నివారించడానికి మీ మోకాళ్లను వెచ్చగా ఉంచుకోవడం, తేలికపాటి వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఎండలో సమయం గడపడం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. నొప్పి తగ్గకపోతే, నడవడం కష్టంగా మారితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించండి. వైద్యుడు సూచించిన మందులను సకాలంలో తీసుకోండి.



### పసిపిల్లల విషయంలో ఈ లక్షణాలను

# నిర్లక్ష్యం చేయకండి.!

దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఢిల్లీతో సహా అనేక రాష్ట్రాలు ప్రస్తుతం తీవ్రమైన చలిని ఎదుర్కొంటున్నాయి. ఈ చలి వాతావరణం నవజాత శిశువులకు మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఎందుకంటే, నవజాత శిశువులకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీని వల్ల వారు జలుబుకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, పసిపిల్లలు తమ సమస్యను చెప్పలేకపోతారు కాబట్టి వారి ప్రవర్తన, శారీరక మార్పులపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం.

నవజాత శిశువుల్లో జలుబు ప్రారంభ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. అందువల్ల చిన్నారుల తల్లిదండ్రులు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. నవజాత శిశువుల్లో జలుబు లక్షణాలను ఎలా గుర్తించాలో ఇప్పుడు తెలుసుకుందాం..

## నవజాత శిశువుల్లో జలుబు లక్షణాలు ఏంటి?

శిశువు చేతులు, కాళ్లు చల్లగా ఉండటం, చర్మం పాలిపోయినట్టు లేదా కొద్దిగా నీలం రంగులో కనిపించడం వంటి లక్షణాలు ఉండవచ్చు. శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా ఉండటం కూడా ఒక సూచన. అలాగే, బిడ్డ ఏడుస్తున్నప్పుడు వేగంగా శ్వాస తీసుకోవడం, తరచుగా తుమ్మడం, ముక్కు మూసుకుపోవడం వంటి సమస్యలు కూడా రావచ్చు. మీ బిడ్డకు ఈ లక్షణాల్లో ఏవైనా కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. సమయానికి చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది.

## నవజాత శిశువులను ఎలా చూసుకోవాలి?

శీతాకాలంలో చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. బిడ్డకు ఎప్పుడూ వెచ్చగా ఉండే దుస్తులు వేయాలి. సమయానికి తల్లిపాలు ఇవ్వడం చాలా ముఖ్యం. ఉదయం స్నానం చేయించిన తర్వాత బిడ్డను కాసేపు ఎండలో కూర్చోనివ్వాలి. ఇది ఆరోగ్యానికి మంచిది. చల్లని గాలి పడకుండా చూడాలి. ఫ్యాన్ లేదా ఏసీకి దూరంగా ఉంచాలి. ఏవైనా ఆరోగ్య సమస్యల లక్షణాలు కనిపిస్తే ఇంట్లో మందులు వేసి సొంత వైద్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

### మలబద్ధకం సమస్య తగ్గాలంటే ఇలా తయారు చేసిన పెరుగును తినాలి..

# ఎంతో మేలు చేస్తుంది..

ప్రస్తుత కాలంలో మనల్ని ఇబ్బంది పెడుతున్న జీర్ణ సంబంధిత సమస్యల్లో మలబద్ధకం సమస్య కూడా ఒకటి. ఇది ఒక సాధారణ సమస్య అయినప్పటికీ దీనిని నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మన దేశంలో దాదాపు 22 శాతం మంది మలబద్ధకంతో బాధపడుతున్నారు. 13 శాతం మంది తీవ్రమైన మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. ఫైబర్ కలిగిన ఆహారాలను తక్కువగా తీసుకోవడం, నీటిని తక్కువగా తాగడం, శారీరక శ్రమ లేకపోవడం, జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా ఈ సమస్య తలెత్తుతుంది. చాలా మంది ఈ సమస్య నుండి బయటపడడానికి మందులను వాడుతూ ఉంటారు. అయితే తరచూ ఈ మందులను వాడడం అంత మంచి పద్ధతి కాదు. మలబద్ధకం సమస్యతో బాధపడే వారు మందులను వాడడానికి బదులుగా జీవనశైలిలో, ఆహార పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలి. మలబద్ధకంతో బాధపడే వారు ముఖ్యంగా ఎండుద్రాక్షలను పెరుగుతో కలిపి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మలబద్ధకాన్ని తగ్గించే సులభమైన, సహజమైన మార్గాలల్లో ఇది ఒకటి. దీని వల్ల మబద్ధకం సమస్య తగ్గడంతో మొత్తం శరీరానికి కూడా మేలు కలుగుతుందని వారు తెలియజేస్తున్నారు. ఇక ఎండుద్రాక్షలను పెరుగుతో ఎలా తీసుకోవాలి.. అలాగే దీనిని తీసుకోవడం వల్ల మనకు కలిగే ఇతర ప్రయోజనాల గురించి వైద్యులు వివరిస్తున్నారు.



## ఇలా తయారు చేయాలి..

ఎండుద్రాక్ష పెరుగును తయారు చేసుకోవడానికి ఒక గిన్నెలో తాజా గోరు వెచ్చని పాలను తీసుకోవాలి. తరువాత ఇందులో 4 లేదా 5 నల్ల ఎండుద్రాక్షలను వేయాలి. తరువాత ఇందులో తోడుకు సరిపోయేలా ఒక చుక్క పెరుగు వేసి బాగా కలపాలి. తరువాత మూత పెట్టి రాత్రంతా కదిలించకుండా ఉంచాలి. మరుసటి ఈ పాలు పెరుగుగా మారతాయి. ఇలా తయారు చేసిన ఎండుద్రాక్ష పెరుగును భోజనంతో పాటుగా తీసుకోవచ్చు లేదా స్నాక్ గా కూడా తీసుకోవచ్చు. పిల్లలకు కూడా ఈ పెరుగును ఆహారంగా ఇవ్వవచ్చు. ఇలా తయారు చేసిన ఎండుద్రాక్ష పెరుగును తీసుకోవడం వల్ల మనం వివిధ రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా..

ఎండుద్రాక్షలో కరిగే ఫైబర్ ఉంటుంది. పెరుగు ప్రోబయోటిక్ గా పని చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. ఎండుద్రాక్షను, పెరుగును కలిపి తీసుకోవడం వల్ల పొట్టలో చెడు బ్యాక్టీరియా శాతం తగ్గుతుంది. మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. దీంతో ఇన్ఫెక్షన్ లు రాకుండా ఉంటాయి. అలాగే దీనిని తీసుకోవడం వల్ల గ్యాస్ సమస్య తగ్గుతుంది. కడుపులో మంట సమస్యతో బాధపడే వారు ఇలా తయారు చేసిన పెరుగును తీసుకోవడం వల్ల పొట్టకు శాంతత లభిస్తుంది. కడుపులో మంట తగ్గుతుంది.

## నోటి ఆరోగ్యానికి కూడా..

అంతేకాకుండా ఎండుద్రాక్ష, పెరుగును కలిపి తీసుకోవడం వల్ల దంతాల, చిగుళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎముకల దృఢంగా మారతాయి. కీళ్ల నొప్పులు తగ్గుతాయి. ఎండుద్రాక్ష పెరుగును తీసుకోవడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. పిల్లలకు ఈ పెరుగును ఇవ్వడం వల్ల వారిలో ఎదుగుదల చక్కగా ఉంటుంది. ఈ విధంగా ఎండుద్రాక్షలతో చేసిన పెరుగు మలబద్ధకం సమస్యను తగ్గించడంతో పాటు మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని దీనిని తరచూ తీసుకోవడం వల్ల పొట్ట సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

# ఇండియాలో మ్యాచ్‌లు ఆడాల్సిందే

## బంగ్లాదేశ్‌కు ఐసీసీ వార్నింగ్!



బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. టీ20 వరల్డ్‌కప్‌లో తమ మ్యాచ్‌లు భారత్ నుంచి శ్రీలంకకు షిఫ్ట్ చేయాలన్న అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తిరస్కరించినట్లు తెలిసింది. ఈ మేరకు మంగళవారం బీసీబీకి ఐసీసీ స్పష్టం చేసినట్లు సమాచారం. షెడ్యూల్ ప్రకారమే భారత్‌లో వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడాలని, లేదంటే పాయింట్లు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. అయి-ంతే ఇటీవల భారత్- బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. భద్రతాపరమైన కారణాలు చూపిస్తూ, తమ జట్టు, భారత్?లో ఆడాల్సిన వరల్డ్?కప్ మ్యాచ్?లను శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి లేఖ రాసింది. అయితే ఆ అభ్యర్థననే ఐసీసీ తాజాగా తిరస్కరించినట్లు తెలిసింది. వచ్చే నెలలో భారత్, శ్రీలంక సంయుక్త వేదికలుగా జరగనున్న టీ20 ప్రపంచకప్?లో బంగ్లాదేశ్ తమ గ్రూప్ దశ మ్యాచ్?లన్నీ భారత్?లోనే ఆడాల్సి ఉంది. అయితే ఇటీవల బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్?ను బీసీసీఐ ఆదేశాల మేరకు రీసెంట్?గా కేకేఆర్ జట్టు నుంచి వదిలేయండతో ఇరు దేశాల మధ్య వివాదం ముదిరింది. ఎలాంటి వివరణ లేకుండా తమ దేశ ఆటగాడు ముస్తాఫిజుర్?ను ఐపీఎల్? నుంచి తప్పించడంతో బంగ్లా ఈ నిర్ణయం తీసుకుంది. తమ క్రికెట్ జట్టును భారత్?కు పంపబోమని బంగ్లా క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఈ వివాదాల మధ్యే బంగ్లాదేశ్ ప్రపంచకప్?నకు తమ జట్టును ప్రకటించింది. 15 మందితో కూడిన బృందం పొట్టి కప్పు టోర్నీలో పాల్గొననున్నట్లు ప్రకటన చేసింది. ఈ జట్టుకు లిట్టన్ దాస్ ్పైన్?గా వ్యవహరించనున్నాడు. ఇందులో ముస్తాఫిజుర్ రహమాన్ కూడా చోటు దక్కించుకున్నాడు. ప్రస్తుతం బంగ్లాలో దేశవాళీ టోర్నీ బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ కొనసాగుతోంది. ఈ లీగ్?లో భారత్‌కు చెందిన రిధిమా పాఠక్ ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే భారత్- బంగ్లాదేశ్ వివాదాల నేపథ్యంలో రిధిమాను కామెంటరీ ప్యానెల్ నుంచి తొలగించారని వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై రిధిమా స్వయంగా క్లారిటీ ఇచ్చారు. తనను తొలగించారని వస్తున్న వార్తలన్నీ అవాస్తవానేనని అన్నారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో తానే స్వయంగా ప్యానెల్? నుంచి తప్పుకున్నట్లు క్లారిటీ ఇచ్చారు. 'బంగ్లా ప్రీమియర్ లీగ్ నుంచి నన్ను తొలగించారు అనే ప్రచారం జరుగుతోంది. అయితే అందులో ఎలాంటి నిజం లేదు. బీపీఎల్ నుంచి వైదొలగాలని నేనే వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకున్నాను. నాకు దేశమే ముఖ్యం. తర్వాతే ఇంకేదైనా. నిజాయతీ, గౌరవం, అభిరుచితో కొన్ని సంవత్సరాలుగా క్రికెట్‌కు సేవ చేసే అవకాశం నాకు లభించింది. దాన్ని మాత్రం కొనసాగిస్తాను. నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు' అని రిధిమా సోషల్ మీడియాలో పేర్కొన్నారు.



# బంగ్లాదేశ్ బీభత్సంపై శిఖర్ ధావన్ ఆగ్రహం

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. అక్కడ జరుగుతున్న వరుస దాడులు, హత్యలు మానవత్వాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయి. తాజాగా ఒక హిందూ వితంతువుపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారం చేయడమే కాకుండా, ఆమెను చెట్టుకు కట్టేసి జుట్టు కత్తిరించిన ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కిరాతక చర్యపై టీమిండియా మాజీ ఆటగాడు శిఖర్ ధావన్ ఎక్స్ వేదికగా స్పందించారు. "బంగ్లాదేశ్‌లో ఒక హిందూ వితంతువుపై జరిగిన క్రూరమైన దాడి గురించి చదివి నా మనసు వికలమైంది. ఎక్కడైనా, ఎవరిపైనా ఇలాంటి హింసను అంగీకరించలేము. బాధితురాలికి న్యాయం జరగాలని, ఆమెకు తగిన మద్దతు లభించాలని నేను ప్రార్థిస్తున్నాను" అని ధావన్ పోస్ట్ చేశారు. బంగ్లాదేశ్‌లో గత డిసెంబర్ నెల నుంచి హింసాత్మక ఘటనలు పెచ్చుమీరాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే కనీసం ఆరుగురు హిందూ పురుషులను దారుణంగా హత్య చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. మృతులలో వ్యాపారులు, సామాన్య పౌరులు ఉన్నారు. వీరిని కాల్చి చంపడం లేదా కత్తులతో పొడిచి చంపడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారు. తాజాగా వితంతువుపై జరిగిన గ్యాంగ్ రేప్ ఘటన దేశవ్యాప్తంగా మైనారిటీ వర్గాల్లో భయాందోళనలను పెంచింది. మానవ హక్కుల సంఘాల ప్రకారం.. వందలాది హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయి, ఆస్తులను లూటీ చేశారు. గతేడాది జూలైలో సింగపూర్‌లో జరిగిన తిరుగుబాటుకు కారకుడైన షరీఫ్ ఉస్మాన్ హాదీ మరణం తర్వాత బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత ఏర్పడింది. అప్పటి నుండి నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. ఈ రాజకీయ అశాంతిని ఆసరాగా చేసుకున్న మతోన్మాద శక్తులు మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మైనారిటీలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. శిఖర్ ధావన్ కంటే ముందే మరికొందరు క్రీడాకారులు, ప్రముఖులు బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణ కోసం గొంతు వినిపించారు. అంతర్జాతీయ వేదికలపై కూడా ఈ అంశంపై చర్చ జరుగుతోంది. ఐపీఎల్, ఇతర క్రికెట్ లీగ్స్ విషయంలో ఇప్పటికే భారత్-బంగ్లా మధ్య ఉద్రిక్తతలు ఉన్న తరుణంలో, ధావన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. క్రీడాకారులు కేవలం ఆటకే పరిమితం కాకుండా, సామాజిక అన్యాయాలపై స్పందించడాన్ని నెటిజన్లు సోషల్ మీడియాలో అభినందిస్తున్నారు.



## వైభవ్ సూర్యవంశీ ఊచకోత..

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ మరోసారి దుమ్మురేపాడు. అండర్ 19 ప్రపంచకప్‌కు సన్నాహకంగా సౌతాఫ్రికాతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్ మూడో మూడో మ్యాచ్‌లో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సెంచరీతో చెలరేగాడు. తనదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో 63 బంతుల్లోనే శతకం సాధించాడు. 74 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్స్‌లతో 127 పరుగులు చేశాడు. అతనికి తోడుగా ఆరోన్ జార్జ్(106 బంతుల్లో 16 ఫోర్లతో 118) సెంచరీతో చెలరేగడంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ అండర్ 19 జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 393 పరుగులు చేసింది. సౌతాఫ్రికా బౌలర్లలో ఎంటాండో సోని(3/61) మూడు వికెట్లు తీయగా.. జాసన్ రోల్స్(2/59) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ అండర్ 19 జట్టుకు ఓపెనర్లు ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్ 63 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. 171.62 స్ట్రైక్‌రేట్‌తో 10 సిక్స్‌లు, 9 ఫోర్లతో వీరవిహారం చేశాడు. భారీ షాట్ ఆడే క్రమంలో అతను క్యాచ్ ఔటవ్వడంతో తొలి వికెట్‌కు నమోదైన 227 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ కాసేపటికే ఆరోన్ జార్జ్ ఔటవ్వగా.. వేదాంత్ త్రివేది(34), మోహమద్ ఇనామ్(19 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 28 నాటౌట్) రాణించారు. ఇప్పటికే ఈ సిరీస్‌ను భారత అండర్ 19 టీమ్ 2-0తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ కూడా గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే పట్టుదలతో ఉంది. ఈ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ వరుసగా 11, 68, 127 పరుగులతో రాణించాడు. ఈ సిరీస్‌కు ముందు బిహార్ తరఫున విజయ్ హజారే ట్రోఫీ ఆడిన వైభవ్ సూర్యవంశీ.. అరుణాచల్ ప్రదేశ్‌పై 190 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. అతని ధాటికి లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే బిహార్ రికార్డ్ స్కోర్ నమోదు చేసింది.

# వరల్డ్‌కప్‌నకు కివీస్ జట్టు ప్రకటన

## శాంట్నర్ కెప్టెన్సీలో బరిలోకి కివీస్



2026 వరల్డ్?కప్?నకు న్యూజిలాండ్ తమ జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు మిచెల్ శాంట్నర్ ్పైన్‌గా వ్యవహరించనున్నాడు. అయితే ఇటీవల వెస్టిండీస్?తో టెస్టు సిరీస్‌లో అదరగొట్టిన పేసర్ జాకబ్ డఫ్ఫీకి ఈ జట్టులో చోటు దక్కింది. దీంతో 31ఏళ్ల డఫ్ఫీ తొలిసారి తన ్రీర్‌లో వరల్డ్‌కప్ టోర్నీ ఆడనున్నాడు. ఫిన్ అలెన్, మార్క్ చాప్‌మన్, దేవన్ కాన్వే, డారిల్ మిచెల్, టిమ్ సైఫర్ట్‌లతో బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా కనిపిస్తుంది. కాన్వేతోపాటు ఫిన్ అలెన్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఇక ్పైన్ శాంట్నర్, ఇష్ సోధి, మిచెల్ బ్రేస్‌వెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర నాలుగురు ఆల్‌రౌండర్లను ఎంపిక చేశారు. ఈ ప్లేయర్లు బ్యాటింగ్‌తోనే కాకుండా బౌలింగ్‌లోనూ రాణించగల సత్తా ఉన్నవాళ్లు. అలాగే మ్యాచ్ హెన్రీ, లాకీ ఫెర్గ్యూసన్, ఆడమ్ మిల్నే, జిమ్మి నీషమ్ లాంటి టాప్ క్లాస్ బౌలర్లతో బౌలింగ్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తుంది. ఈ స్టార్ బౌలర్ల క్యాంప్‌లో ఆర్సీబీ స్టార్ జాకబ్ డఫ్ఫీ ఉండనున్నాడు. అలా బ్యాటింగ్, బౌలింగ్‌లో కివీస్ జట్టు పటిష్ఠంగా కనిపిస్తుంది. ఐపీఎల్ స్టార్ ఫ్రాంచైజీ ఇటీవల అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో జాకబ్ డఫీని రూ.2 కోట్ల బేస్‌ప్రైజ్‌కు దక్కించుకుంది. గతేడాది డిసెంబర్‌లో అతడు వెస్టిండీస్?పై టెస్టు సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చుడాడు. ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న డఫీని కివీస్ బోర్డు వరల్డ్‌కప్ ఎంపిక చేసింది. 2025లో డఫీ మొత్తం 39 ఇన్నింగ్స్‌ల్లో 17.11 యావరేజ్‌తో 81 వికెట్లు నేలకూల్చాడు. దీంతో అతడు న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ సర్ రిచర్డ్ హాడ్లీ 40ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. రిచర్డ్ హాడ్లీ 1985వ సంవత్సరంలో 29 ఇన్నింగ్స్‌లో 79 వికెట్లు తీసి ఈ రికార్డ్ నెలకొల్పాడు. ఇక ప్రస్తుతం అద్భుతమై ఫామ్?లో ఉన్న డఫీని వరల్డ్‌కప్‌లో తొలి మ్యాచ్‌నుంచే బరిలోకి దింపడం పక్కా!భారత్, శ్రీలంక సంయుక్త వేదికలుగా వచ్చే నెల 07న టీ20 వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. ఫైనల్ మ్యాచ్ 08న జరగనుంది. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే శ్రీలంకలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. లేదంటే భారత్‌లోనే తుది పోరు ఉంటుంది. ఈ టోర్నీ కోసం ఇప్పటికే భారత్ సహా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికాతో సహా అనేక దేశాలు తమతమ జట్లను ప్రకటించేశాయి. ఇంకా మరికొన్ని జట్లు తమతమ స్క్వాడ్‌లను ప్రకటించాల్సి ఉంది.

వరల్డ్‌కప్‌కు న్యూజిలాండ్ జట్టు : మిచెల్ శాంట్నర్ (్పైన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధి




# న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు సిద్ధమైన శ్రేయస్ అయ్యర్

భారత క్రికెట్ జట్టుకు శుభవార్త, ఎందుకంటే వన్డే జట్టు వైస్ ్పైన్ శ్రేయస్ అయ్యర్ ఫిట్ అని ప్రకటించారు. జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న భారత్-న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో అయ్యర్ ఆడవచ్చు. BCCI భారత జట్టులో చేర్చింది, అయితే శ్రేయస్ అయ్యర్ ఆడటం అతని ఫిట్‌నెస్ ఆధారంగా ఉంటుందని కూడా చెప్పింది. దైనిక్ జాగరణ్ ప్రకారం, న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడేందుకు శ్రేయస్ అయ్యర్ ఫిట్‌గా ఉన్నాడు. గత కొన్ని రోజులుగా BCCI సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతని శిక్షణ పూర్తయింది. నేషనల్ క్రికెట్ అకాడమీ హెడ్ VVS లక్ష్మణ్ ఇ-మెయిల్ ద్వారా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ నివేదికను సమర్పించారు. భారత జట్టులోకి తిరిగి రాకముందు శ్రేయస్ అయ్యర్ 2 మ్యాచ్‌లు ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. అతను విజయ్ హజారే ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో పునరాగమనం చేశాడు. ఆ మ్యాచ్‌లో ముంబై తరపున ఆడుతూ అయ్యర్ 82 పరుగులు చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో మిగిలిన లీగ్ మ్యాచ్‌లకు అయ్యర్‌ను ముంబై జట్టుకు ్పైన్‌గా నియమించారు. అతను జనవరి 8న పంజాబ్‌తో తన రెండో మ్యాచ్ ఆడనున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో క్యాచ్ పడుతున్న సమయంలో శ్రేయస్ అయ్యర్‌కు గాయ-ంమైంది. రక్తస్రావం కారణంగా అతని పరిస్థితి చాలా తీవ్రంగా మారింది, అతను ICUలో కూడా ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు సుదీర్ఘ చికిత్స ప్రక్రియ తర్వాత అయ్యర్ పూర్తిగా కోలుకున్నాడు. న్యూజిలాండ్ ODI సిరీస్ కోసం భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (్పైన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ్ఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (వైస్ ్పైన్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్



## మహిళల కోసం జెమిమా రోడ్రిగ్స్ సరికొత్త అవతారం

మహిళా క్రికెటర్ జెమిమా రోడ్రిగ్స్ మైదానంలో ఎంత చురుగ్గా ఉంటారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆమె అదే ఉత్సాహంతో మహిళల సాధికారత, భద్రత దిశగా ఒక కీలక అడుగు వేశారు. మహిళల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా హెల్మెట్‌లను రూపొందించే ట్వారా కంపెనీతో జెమిమా దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఆమె కంపెనీలో ఈక్విటీ భాగస్వామిగా వ్యవహరిస్తారు. మహిళలు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బాధ్యతాయుతంగా ఉండాలని, తమ రక్షణను తామే చూసుకోవాలనే స్పృహ కల్పించడంలో జెమిమా క్రియాశీలక పాత్ర పోషించనున్నారు. ఈ భాగస్వామ్యం గురించి జెమిమా రోడ్రిగ్స్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "క్రీడలు మనకు క్రమశిక్షణ, నిలకడ, నమ్మకాన్ని నేర్పుతాయి. సామాన్య మహిళలకు వారి దైనందిన జీవితం కూడా ఇవే విషయాలను నేర్పుతుంది. మహిళలకు మెరుగైన రవాణా సౌకర్యాలు ఉంటే వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అలాగే సరైన భద్రత ఉంటే వారికి మరింత ధైర్యం వస్తుంది. ట్వారా కంపెనీ ఈ రెండు అంశాలపై దృష్టి సారించింది. అందుకే ఈ భాగస్వామ్యం నాకు వ్యక్తిగతంగా చాలా సంతోషాన్ని ఇస్తోంది" అని ఆమె తెలిపారు. భవిష్యత్తులో మహిళా రైడర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త డిజైన్లను తీసుకురావడంలో జెమిమా తన సలహాలను కూడా అందించనున్నారు. ట్వారా వ్యవస్థాపకురాలు అల్పనా పరీదా మాట్లాడుతూ.. జెమిమా వంటి స్ఫూర్తిదాయకమైన క్రీడాకారిణి తమ కంపెనీలో చేరడం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. జెమిమాలో ఉన్న క్రమశిక్షణ, ఉత్సాహం, లక్ష్యం పట్ల ఉన్న స్పష్టత.. తమ కంపెనీ ఆలోచనలతో సరిగ్గా సరిపోతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఈ కంపెనీ హెల్మెట్‌లు ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా 600కు పైగా నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. అయితే 2026 నాటికి ఆఫ్‌లైన్ రిటైల్ మార్కెట్‌లోకి ప్రవేశించి, ప్రతి నగరంలోని స్టోర్లలో తమ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలని కంపెనీ ప్లాన్ చేస్తోంది.





# ఆ రెండు చిత్రాలకు హైకోర్టులో ఊరట

## టిక్కెట్లు పెంచుకునేలా ఉత్తర్వులు

'ది రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల విషయంలో గతంలో సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు 'పుష్ప2', 'ఓజీ', 'గేమ్ ఛేంజర్', 'అఖండ 2' చిత్రాలకే పరిమితం చేసింది. దీంతో తాజా చిత్రాల నిర్మాతలకు ఊరట లభించినట్లయ్యింది. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. దీనిపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన తీర్పును ఆ చిత్రాల వరకే పరిమితం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ రెండు చిత్రాలకు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం లభించింది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'ది రాజాసాబ్' జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదల కానుంది. హైకోర్టు ఉత్తర్వులతో 'ది రాజాసాబ్' బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి.



## మా ఇంటి బంగారంతో సమంత పలకరింపు

సమంత అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దర్శకురాలు మినహా ఇప్పటివరకూ ఎవరూ ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను సామ్ షేర్ చేశారు. ఈ సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్న సమంత .. ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. 'మీరు చూస్తా ఉ ఒడండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది అంటూ రాశారు. జనవరి 9న ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో అభిమానులు సంబర పడుతున్నారు. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అని కామెంట్స్ చేస్తున్నారు. 'ఓ బేబీ' తర్వాత సమంత దర్శకురాలు నందిని రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. గతేడాది అక్టోబర్ 2న దీని షూటింగ్‌ను ప్రారంభించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు. దీనితో పాటు సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.





## అతడితో అనుష్క స్నేహానికే పెద్ద పీట!

ప్రభాస్-అనుష్క స్నేహం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు కలిసి ఎన్నో సినిమాలు చేసారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. ఆ స్నేహంతోనే వాళ్లిద్దరుప్రేమికులు అయ్యారా? పెళ్లి చేసుకుంటున్నారా? అన్న ప్రచారం కూడా జరిగింది. కానీ అందులో ఎంత మాత్రం నిజం లేదు. ఇద్దరు కేవలం ఓ మంచి స్నేహితులు మాత్రమే. స్నేహితులుగా మొదలైన వారి ప్రయాణం ఇప్పుడు ఎంతో గొప్పగా సాగుతోంది. ప్రస్తుతం కలిసి నటించకపోయినా? వారి మధ్య స్నేహం మాత్రం అంతే పదిలంగా ఉంది. ప్రభాస్ కు మంచి పిల్ల దొరకాలని, ఆ పిల్లని తానే పెళ్లి కూతుర్ని కూడా చేయాలని అనుష్క ఆశపడుతుంది. అంత గొప్ప స్నేహం వారి మధ్య ఉంది. తాజాగా ఓ టీవీ షోలో మీకు ప్రభాస్ తో స్నేహం కావాలా? అతడితో నటించడం కావాలా? అని అడిగితే అనుష్క ఏమని సమాధానం చెప్పిందో తెలుసా? అతడితో తనకు జీవితాంతం కేవలం స్నేహం మాత్రమే కావాలని, నటించడం అన్నది తాను కోరుకోవడం లేదని, కోరుకోనని కూడా చెప్పింది. ఇద్దరి మనస్తత్వాలు ఒకేలా ఉండటంతో తనకి బెస్ట్ ఫ్రెండ్ లా మారిపోయాడు అంది. ఒకసారి తనతో స్నేహం కుదిరితే జీవితాంతం ఆ అనుబంధం అలా గుర్తుండిపోతుంది. మనుషులకు, బంధాలకు అంత విలువనిచ్చే ప్రభాస్ వ్యక్తిత్వం తనకు ఎంతో నచ్చుతుందన్నారు. తనతో కలిసి నటించడానికి తానెప్పుడు కంఫర్ట్ గానే ఫీలవుతానంది. వెండి తెరపై కొన్ని జోడీలకు ప్రత్యేకమైన అభిమానులుంటారు. తనది ప్రభాస్ ది అలాంటి జోడీనే అన్నారు. అనుష్క-ప్రభాస్ జంటగా నటించిన 'మిర్చి' బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. అంతకు ముందు 'బిల్లా' అనే యాక్షన్ సినిమాలోనూ నటించి మెప్పించారు. ఆ తర్వాత 'బాహుబలి' ఫ్రాంచైజీలోనూ నటించారు. ఈ సినిమాతో ఏకంగా పాన్ ఇండియాలోనే ఫేమస్ అయ్యారు. ఆ తర్వాత జోడీ మరోసారి కలిసి నటించే ఛాన్స్ తీసుకోలేదు. ప్రభాస్ 'బాహుబలి' తర్వాత పాన్ ఇండియా స్టార్ కావడంతో? ఇతర హీరోయిన్లతోనే పని చేస్తున్నాడు. దర్శకులు కూడా అనుష్క -ప్రభాస్ లను కలిపే ప్రయత్నాలు చేయలేదు. 'కల్కి 2' నుంచి దీపికా పదుకొణే తప్పుకోవడంతో ఆ స్థానంలోకి అనుష్కను తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది.మరి అది సాధ్యమవుతుందా? లేదా? అన్నది చూడాలి. ఇద్దరు కలిసి మరో సినిమా చేయాలని అభిమానులైతే బలంగా కోరుకుంటున్నారు. 'బాహుబలి' రిలీజ్ నుంచి డార్లింగ్ కి ఎన్నో రిక్వెస్ట్ లు వెళ్లాయి. కానీ ప్రభాస్ మాత్రం వాటిని సీరియస్‌గా తీసుకోవడం లేదు. అనుష్క మాత్రం వేర్వేరు ప్రాజెక్ట్ లు చేసింది. కానీ అవేవి కూడా ఆశించిన ఫలితాలు సాధించలేదు. చివరిగా 'ఘాటీ' తో ప్రేక్షకుల ముందుకొచ్చినా? నిరాశ పరిచిన సంగతి తెలిసిందే.

## శీతాకాలంలో గ్లామర్‌తో హీట్ పుట్టిస్తున్న నభా నటేష్!

కార్తికేయ 2 సినిమాతో భారీ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న నిఖిల్ సిద్ధార్థ్ ఆ తర్వాత అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రం చేసి ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేదు. ఆ తర్వాత స్వయంభు మూవీని ప్రకటించారు. వాస్తవానికి గత ఏడాది ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల విడుదలకు నోచుకోలేదు. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా వస్తున్న ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్త మీనన్ తో పాటు ప్రముఖ బ్యూటీ నభా నటేష్ కూడా హీరోయిన్గా నటిస్తోంది. 2026 ఫిబ్రవరి 13న విడుదల కాబోతోంది. తెలుగు , తమిళ్ , కన్నడ, హిందీ, మలయాళం భాషల్లో విడుదల కానున్న నేపథ్యంలో అటు టీజర్లు, మేకింగ్ వీడియోలు ఇప్పటికే యూట్యూబ్లో అందుబాటులోకి వచ్చి ఆడియన్స్ కి సినిమాపై అంచనాలు పెంచేసాయి. ఇందులో నిఖిల్ ఒక యోధుడిగా కనిపిస్తున్నారు. ఇటు విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో అటు నభా నటేష్ కూడా సోషల్ మీడియా వేదికగా గ్లామర్ ను వలకబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకోవడమే కాకుండా తన సినిమాపై అంచనాలు పెంచే ప్రయత్నం చేస్తోంది అని నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా శీతాకాలంలో హీట్ పుట్టిస్తూ అందాలను ఆరబోస్తూ ఫోటోలు షేర్ చేసింది ఈ ముద్దుగుమ్మ

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463